# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఒలింపియాడ్ సంస్కృతి దేశంలో వేగంగా విస్తరిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కారక్రమంలో తెలిపారు.**

2. **ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ ఈ రోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు.**

3. **రాష్ట్రంలో పెట్రోల్ బంకుల్లో 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించడకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

4. **ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న 'ముఖ్యమంత్రి ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **బిసిల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్‌లో 50 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

==========================

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులు గణితశాస్త్ర ఒలింపియాడ్ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన నిన్న మాట్లాడుతూ.. ఒలింపియాడ్ సంస్కృతి దేశంలో వేగంగా విస్తరిస్తోందన్నారు. దేశంలో గణితశాస్త్ర ఒలింపియాడ్‌కు ఎంపిక ప్రక్రియ అత్యంత కఠినంగా ఉంటుందని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ ఈ రోజు, రేపు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనున్నారు. తొలుత శ్రీకాకుళం జిల్లా, అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం విశాఖపట్నం జిల్లా కేంద్రంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కె.హరిబాబు, తదితరులు పాల్గొంటారు. విశాఖపట్నం పర్యటన ముగించుకుని ఈ రాత్రి తిరుపతికి చేరుకుంటారు, తిరుమలలోని గాయత్రి అతిథిగృహంలో బసచేసి,

రేపు ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. అనంతరం తిరుచానూరు చేరుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు.

---------------------------

రాష్ట్రంలో పెట్రోల్ బంకుల్లో 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించడకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ఇంధన సరఫరాపై శ్రవణ మాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలు, కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఒక్కసారిగా సమస్య తలెత్తడంపై విచారణ జరపాలన్నారు. వ్యవసాయ, ఆక్వా రంగాల అవసరాలు పెరిగాయని... వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని స్పష్టం చేశారు. రైతులకు కూపన్ విధానం ప్రవేశ పెట్టే ఆలోచన చేయాలని సూచించారు. ప్రతీ బంక్ దగ్గర సీసీ కెమేరాలతో పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడా బ్లాక్‌లో అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

---------------------------

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న 'ముఖ్యమంత్రి ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలను, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రస్తుతం కలెక్టర్ల అధ్వర్యంలో జిల్లాలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలన్నారు.

---------------------------

విశాఖపట్నం సమీపంలో ఉన్న తర్లువాడలో ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శంకుస్థాపన చేయనున్నారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ ఈ డేటా సెంటర్‌ను 1 గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖపట్నం నగరం, ఆసియా ఖండంలో కీలకమైన టెక్ హబ్‌గా మారనుందని, డేటా స్టోరేజి, ఏఐ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందుబాటులోకి రానుందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా నిలుస్తుందన్నారు.

---------------------------

తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని తన నివాసంలో స్వీయ గణన కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా తన వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన ప్రాతిపదిక అని అన్నారు. డిజిటల్ పద్ధతిలో వివరాల స్వీయ నమోదును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.

---------------------------

నరసాపురం నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి వరకు నడిచే నూతన వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలును నరసాపురం రైల్వే స్టేషన్‌లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం, రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రైలు వల్ల హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు, వ్యాపారస్తులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

---------------------------

బిసిల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్ లో అత్యధికంగా 50 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడలో శెట్టిబలిజ సంఘం నిన్న నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలోనే అవసరమైన చోట చేతి వృత్తుల వారికి వర్క్ షాపు ఏర్పాటు చేస్తామన్నారు. తాజాగా మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించినట్లు చెప్పారు. నీరా కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసి కల్లుగీత కార్మికులకు మరింత అండగా నిలుస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

---------------------------

ఐ పి ఎల్ 2026లో భాగంగా చెన్నైలో నిన్న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేయగా, గుజరాత్ 16.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. లఖ్ నవూలో జరిగిన మరో మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై, కోల్‌కతా నైట్ రైడర్స్, సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో ఇరు జట్లు 155 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయి సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 3 బంతుల్లో 2 వికెట్లు కోల్పోయి 1 పరుగుకే పరిమితమైంది. కోల్‌కతా తొలి బంతికే లక్ష్యాన్ని చేధించింది.

---------------------------

ఉత్తర, దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ, నైరుతి దిశగ గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

తెలంగాణ రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================